అభివృద్ధికి అందరూ సహకరించాలి

● హైడ్రా కమిషనర్ రంగనాథ్



లింగంపల్లి ఆర్‌ఓబీ వద్ద పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, అధికారులు

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అందరూ సహకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. లింగంపల్లి ఆర్‌వోబీ వద్ద వర్షపు నీరు నిల్వకుండా రూ. 4 కోట్ల వ్యయంతో బాక్స్ కల్వర్టు పనులు చేశారు. లింగంపల్లి గ్రామం వైపు నుంచి కాలువ పనులను అధికారులు ప్రారంభించారు. కొంతవరకు పనులు జరిగాయి. గ్రామం వద్ద కొంతమంది పనులను అడ్డుకోవడంతో రెండు నెలల నుంచి పనులు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న హైడ్రా కమిషన్ రంగనాథ్ బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వరదనీటి తీవ్రత గురించి కార్పొరేటర్ రాగం నాగేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఓబీ నుంచి లింగంపల్లి గ్రామం వరకు, నల్లగండ్ల పెద్దచెరువు నుంచి వచ్చే నాలాను రంగనాథ్ పరిశీలించారు. నిలిచిపోయిన ఆర్‌ఓబీ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని హైడ్రా అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గోపీ చెరువును పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, సిబ్బంది, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మై హోం మంగళం రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నామని ఉప కమిషనర్ ప్రశాంతి పేర్కొన్నారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించామన్నారు. సర్కిల్ పరిధిలో 17 ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలుస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. రెండు రోజులుగా పనులు జరుగుతున్నాయన్నారు. మై హోం మంగళం రోడ్డును అధికారులు బుధవారం పరిశీలించారని ఉపకమిషనర్ తెలిపారు.



తహసీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్రభుత్వ భూములను కాపాడండి : సీపీఐ

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ డిమాండ్ చేసింది. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగిస్తున్నారని, బడాబాబులు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మాదాపూర్, గోపన్‌పల్లి ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడి పేదలు, ఇళ్లులేని నిరుపేదలకు పంచాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పర్వతాలు, చందుయాదవ్, తుపాకుల రాములు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు రఘు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ వాల్వ్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

తాగునీరు వృథా కాకుండా చర్యలు

● పైపులైన్ వాల్వ్‌కు మరమ్మతులు

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో తాగునీటి వృథాను అధికారులు అరికట్టారు. నాలుగు రోజులుగా పైపులైన్ వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులు బుధవారం వాల్వ్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టారు.

నల్లగండ్ల కూరగాయల మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల కూరగాయల మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కోరారు. బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పైపులైన్లకు నిధులు మంజూరు చేయాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. మేయర్‌ను కలిసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు వీరేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌కు వీడ్కోలు

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్న పున్నారావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. స్టేషన్ మాస్టర్ రాజు ఆయనను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పున్నారావు 30 సంవత్సరాలుగా సంస్థకు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పున్నారావు కుటుంబ సభ్యులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతలు

వాహనదారులు, పాదచారుల ఇబ్బంది



హెచ్ఎంటీ స్వర్ణపురికి వెళ్లే రహదారి దుస్థితి



బురదమయంగా మంజీరా రోడ్డు

చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతలు పడుతున్నాయి. దీప్తిశ్రీనగర్ నుంచి ధర్మపురి క్షేత్రానికి వెళ్లే రహదారి గుంతల మయంగా మారింది. రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి.

● చందానగర్ జీఆర్ గ్యాస్ ఏజెన్సీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు గల మంజీరా పైపులైన్ రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చందానగర్ నుంచి అమీన్‌పూర్ వెళ్లే శ్రీదేవి థియేటర్ రోడ్డు గుంతలమయంగా మారింది. రాజేందర్‌రెడ్డి కాలనీ వద్ద అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

మియాపూర్/చందానగర్, ఆంధ్రజ్యోతి



దీప్తిశ్రీనగర్ నుంచి ధర్మపురికి వెళ్లే రహదారి పై నిలిచిన నీరు

రూ. 1.37 కోట్లతో కాలనీల్లో సీసీ రోడ్లు

హైదర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ కాలనీ, కమల ప్రసన్ననగర్, మాధవరంనగర్, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్, రిక్షాపుల్లర్స్ కాలనీలో రూ. 1.37 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, కాలనీల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు ప్రారంభం

రూ.1.90 కోట్లతో వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుండి మాధవరం నగర్‌లోని హైటెన్షన్ లైన్ కింద వరకు నిర్మించిన కల్వర్టును కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి ఎమ్మెల్యే గాంధీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లనాటి సమస్య పరిష్కారం అయిందన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

పెన్షనర్ల సమస్యలపై నిరంతర పోరాటం

ఖేల్‌కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు తెలిపారు. బుధవారం బీహెచ్ఈఎల్ ఎంఐజీ కాలనీలో సీనియర్ సిటిజన్స్ భవనంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్‌ల మంజూరు కోసం పోరాటం చేస్తున్నామని, ఫలితంగా 70 మందికి పెన్షన్‌లు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన వారికి జూలైలో మంజూరయ్యేలా చ్యలు తీసుకుంటామన్నారు. కనీసం పెన్షన్ రూ. 9 వేలకు పెంచాలని రాష్ట్రస్థాయిలో పోరాటం చేస్తున్నామన్నారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల ఎస్‌బీఐ నుంచి ఎంఐజీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని యాజమాన్యం మూసివేయడంతో జనరల్ ఆస్పత్రికి వెళ్లేందుకు కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై యాజమాన్యానికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామారావు, డిప్యూటీ కార్యదర్శి ప్రభాకర్‌రావు, సంయుక్త కార్యదర్శి మోహన్, సభ్యులు వెంకటరెడ్డి, కమ్మ రాధాకృష్ణ, నాయుడు, సత్యనారాయణ, రాయుడు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు

పాము కనిపిస్తే 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్'ను సంప్రదించండి

నామమాత్రపు రుసుంతో సంస్థ వలంటీర్ల సేవలు

అల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలుచోట్ల పాముల సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇటీవల కాలంలో ఎండలు తగ్గి వర్షాలు పడుతుండటంతో పాముల సంచారం పెరిగింది. గృహ సముదాయాలలో పాములు సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పాములను కొట్టి చంపేస్తున్నారు. ఇలాంటి సమయాల్లో కంగారు పడకుండా 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' సంస్థ నంబర్‌కు 83742 33366 ఫోన్ చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఫోన్ చేసిన అనంతరం, సమస్యాత్మక ప్రదేశం అనుసారం ఐవీఆర్ఎస్. విధానంలో (ఉదాహరణకు కూకట్‌పల్లి ప్రాంతానికి 8ని, మాదాపూర్ ప్రాంతానికి 7ని) ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వారు వచ్చి పామును పట్టుకున్నందుకు రూ. 400 చెల్లించాల్సి ఉంటుందని, ఒక వేళ పాము తప్పించుకుంటే రూ.300 రుసుం చెల్లించాల్సి ఉంటుందని 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' ప్రధాన కార్యదర్శి అవినాష్ తెలిపారు. నిజానికి 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' ఒక లాభాపేక్ష లేని సంస్థ అని, అయితే, సమయానికి పామును పట్టుకుని అడవిలో వదిలిపెట్టేందుకు కనీస ఖర్చుల కింద ఇలా నామమాత్రపు రుసుం తీసుకుంటామని ఆయన తెలిపారు. నిరుపేదలు ఫిర్యాదు చేసినప్పుడు వారి తరపున 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' సంస్థే ఆ ఫీజును పామును పట్టుకున్న వలంటీర్‌కు చెల్లిస్తోందన్నారు.



ఓ ఇంట్లోకి వచ్చిన పామును పట్టుకున్న వలంటీర్ (ఫైల్)

లైట్లు ఆర్పేసి మహిళలపై దాడి

● జూబ్లీహిల్స్ బాబిలాన్ పబ్‌లో దారుణం

బంజారాహిల్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): బిల్లు ఎక్కువ వేశారని నిలదీసినందుకు లైట్లు ఆర్పేసి మహిళలపై దాడి చేశారు పబ్ సిబ్బంది. సోషల్ మీడియాలో ఈ దారుణాన్ని బాధితురాలు పోస్టు చేయడంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. చర్లపల్లికి చెందిన దీనా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ మీనల్ మీను, ఆమె తల్లి, మరికొంతమంది ఈనెల 26న జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్.10 లోగల బాబీలాన్ పబ్‌కు వెళ్లారు. జొమాటో 20 శాతం రాయితీ కింద టేబుల్ బుక్ చేసుకున్నారు. పార్టీ అయిపోయాక పబ్ సిబ్బంది బిల్లును దీనాకు ఇచ్చారు. బిల్లులో తమకు రావాల్సిన 20 శాతం రాయితీ ఇవ్వలేదని, తాము ఆర్డర్ చేయని డ్రింక్‌కు రూ. 1,850 బిల్లు వేసినట్టు గమనించింది. ఇదే విషయాన్ని సిబ్బందిని నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. నిష్టూరంగా మాట్లాడారు. వారి ప్రవర్తనను వీడియో తీసేందుకు దీనా, మీనల్ ప్రయత్నించారు. ఈ క్రమంలో పబ్ సిబ్బంది లైట్లు ఆర్పేసి దీనా, మీనల్, ఆమె తల్లిపై చేయి చేసుకున్నారు. దుర్భాషలాడారు. ఈ ఘటనతో షాక్‌కు గురైన మీనల్ తమకు జరిగిన అన్యాయం గురించి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇది వైరల్‌గా మారింది. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ప్రమాదం

యూసు‌ఫ్‌గూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపి ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన ఎం.తేజ అమీర్‌పేట మెట్రో పిల్లర్ నంబర్.1460 వద్ద ప్రమాదానికి గురయ్యాడని వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన తేజను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని పరిశీలించగా మద్యం మత్తులో ఉన్నాడని నిర్ధారించి కేసు నమోదు చేశారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో

రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

గచ్చిబౌలి/ఖేల్ కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు రూ. 200 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తుందని, అందులో భాగంగా తాను అడగగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినందుకు గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. రూ. 30 లక్షల వ్యయంతో ఫ్రెండ్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, శ్రీరంగాపురం కాలనీల్లో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు, రూ. 20 లక్షల వ్యయంతో బాలాజీనగర్, ఆదిత్యనగర్ కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు, రూ. 35 లక్షల వ్యయంతో జేపీనగర్, ఏఎస్‌రాజునగర్ కాలనీల్లో చేపట్టనున్న భూగర్భ డ్రేనేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులకు సన్మానం

రాయదుర్గం, మే 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండో తరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులను బుధవారం గచ్చిబౌలిలోని ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)ఆడిటోరియంలో సన్మానించారు. కేవీఎస్ ఆర్‌వో హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ జి. కృష్ణవేణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహగారి తేజ్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమ్ము రాజేందర్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్

కేపీహెచ్‌బీకాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్ము రాజేందర్‌కు జేఎన్‌టీయూ హైదరాబాద్ డాక్టరేట్ ప్రకటించింది. హెచ్‌సీయూ ప్రొఫెసర్ డా.కేవీ రాజశేఖర్, జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డా.యార్లగడ్డ గోపీకృష్ణ పర్యవేక్షణలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ డా.వాసంతి సమక్షంలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వైవా పూర్తిచేశారు.



రాజేందర్

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి భవనం మూడో అంతస్తు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన విజయ్(32) వివేకానందనగర్‌లో ఓ కర్రీ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. రోజూ మద్యం తాగేవాడు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కర్రీ పాయింట్ నిర్వహిస్తున్న భవనం మూడో అంతస్తు నుంచి కిందపడ్డాడు. వాచ్‌మన్ చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికురాలు..

అల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కార్మికురాలు మృతి చెందింది. అల్లాపూర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్‌కు చెందిన గుంపు నర్సయ్య భార్య అనసూయ స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తోంది. మెటీరియల్ లిఫ్టింగ్ మెషీన్‌లో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైన అనసూయ కిందపడిపోయింది. అక్కడ ఉన్న వారు ఆమెను సమీపంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అనసూయ(ఫైల్)

యువకుడి అదృశ్యం

హైదర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీలో నివసిస్తున్న పవన్ కల్యాణ్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించక పోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పవన్‌కల్యాణ్‌రెడ్డి

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

మియాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు జయంతిని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన సేవలను నాయకులు గుర్తుచేశారు. జేపీ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్లతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్ఠను ప్రపంచదేశాలకు తెలియజేసిన గొప్ప నేత రామరావు అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వివేకానందనగర్ దీనబంధు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మినీ మహానాడు నిర్వహించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ఎస్ రాజు, నాయకులు రాంబాబు, భీమ్, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, నరసయ్య, బాబురావు, టి.లక్ష్మి, రాధిక, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

● హైదర్‌నగర్ త్రివేణి సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

● శాతవాహన నగర్‌లో టీడీపీ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో భానుప్రసాద్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వివేకానందనగర్ దీనబంధు కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు



శాతవాహన నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్రశంసాపత్రం




మాదకద్రవ్యాల నియంత్రణ కోసం పేట్‌బషీరాబాద్ ఎస్ఐ లావణ్య గౌడ్ చేసిన కృషిని గుర్తించి బుధవారం ఆమెకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా.
-(పేట్‌బషీరాబాద్, మే28(ఆంధ్రజ్యోతి)

అనుమతి లేకుండా షట్టర్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోండి

● ఆశాజ్యోతి ఉమెన్ నెట్‌వర్క్ నిర్వాహకులు రమణి మల్యాల

నిజాంపేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి క్రాంతినగర్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ స్థలం ఆక్రమణతో పాటు అనుమతు ల్లేకుండా షాపుల నిర్మాణం చేపట్టారని ఆశాజ్యోతి ఉమెన్ నెట్‌వర్క్ నిర్వాహకులు రమణి మల్యాల పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, కనీసం ఈసారైనా ఆ కబ్జా స్థలానికి అడ్డుకట్ట వేసి ప్రజలకు ఆ స్థలం ఉపయోగపడే విధగా చూడాలని పేర్కొంటూ ఆమె మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణి మల్యాల మాట్లాడుతూ, ఆర్టీసీ కాలనీ లేఅవుట్ ప్రకారం బాచుపల్లి నుంచి మల్లంపేట వెళ్లే రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతి తీసుకున్నారని, కానీ ఏడాది కాలంగా కాంగ్రెస్, బీజేపీ నాయకుల సహాయ సహకారాలతో షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో అధికారిక లీజు లేకుండానే మూడు షాపులు నిర్మించుకొని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా అసోసియేషన్ ద్వారా షాపులు ఏర్పాటు చేస్తే కాలనీ, దేవాలయం అభివృద్ధి చెందుతుందన్నారు.



కార్మికులతో మదన్‌గౌడ్

కార్మికుల సంక్షేమానికి కృషి

పేట్‌బషీరాబాద్, మే28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నానని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఏఆర్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో బుధవారం ఆయన కార్మికులు, యాజమాన్యం మధ్య నూతన అగ్రిమెంట్‌ను కుదిర్చారు. ఈ ఒప్పందం ప్రకారం నలుగురు కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు గిఫ్ట్ రూపంలో సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున మూడేళ్లకు రూ. 30 వేలు కార్మికులకు ఇచ్చేలా యాజమాన్యాన్ని ఆయన ఇప్పించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్‌ను కార్మికులు శాలువాతో యూనియన్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె. సుభాష్, రాంబాబు, జీఎస్. నరేంద్రబాబు, శ్రీనివాస్‌రావు, రమేష్, నర్సింహారెడ్డి, సత్యనారాయణలు పాల్గొన్నారు.



రోడ్డుకు రెండువైపులా వేసిన పైపులు

ప్రమాదకరంగా డ్రైనేజీ పైపులు

కుత్బుల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వాణినగర్ నుంచి శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వైపు వెళ్లే రోడ్డులో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టర్ భారీ పైపులను తీసుకువచ్చారు. చెత్త డంపింగ్ చేసే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా భారీ పైపులను వేయడంతో రోడ్డు పైకి వచ్చాయి. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఆ పైపులను ఢీకొని ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని, అక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

బాపూనగర్‌లో తాగునీరు రోడ్డు పాలు

కుత్బుల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ బాపూనగర్‌లో తాగునీరు రోడ్డు పాలవుతోంది. రోడ్ నెంబర్ 5 చివరిలోని వాల్వ్ వద్ద నీటిని వదిలిని ప్రతిసారీ తాగునీరు లీకై రోడ్డుపై పారుతోందని, సుమారు 20 ఇళ్లకు సరిపోయే నీరు రోడ్డుపై వృథాగా పోతున్నదని స్థానికులు అంటున్నారు. నిత్యం లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని బాపూనగర్ వాసులు కోరుతున్నారు.



వర్షం నీరు నిలిచి బురదమయంగా మారిన లింక్ రోడ్డు

అధ్వానంగా కాలనీల లింక్ రోడ్డు

● వర్షం వస్తే అవస్థలు

కుత్బుల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని ప్రసూననగర్, నవోదయనగర్‌ల సరిహద్దులో ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. రెండు కాలనీల్లో సీసీ రోడ్లు వేయించిన అధికారులు.. రెండు కాలనీలను కలిపే లింక్ రోడ్డ వద్ద సీసీ వేయించకపోవడంతో వర్షం కురిస్తే ఆ ప్రాంతం మొత్తం బురదమయంగా మారి నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పది మీటర్ల దూరం ప్రయాణిస్తే తమ కాలనీల్లోకి వెళ్లే తాము నీరు నిలువ ఉండటంతో అర కిలో మీటర్ మేర తిరిగి ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని ఇరు కాలనీల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెండు కాలనీలను కలిపే చోట సీసీ రోడ్డు వేయించాలని ప్రసూననగర్, నవోదయనగర్ కాలనీల వాసులు కోరుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం!

● గుంపులుగా తిరుగుతూ దాడికి యత్నం
● రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్న జనం
● నియంత్రించాలని జంట సర్కిళ్ల అధికారులకు ప్రజల వినతి



సూర్యనగర్‌లో రోడ్డుపై కుక్కల గుంపు



చింతల్‌లో తిరుగుతున్న కుక్కలు

కుత్బుల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై కుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడికి యత్నిస్తుండటంతో ఇంటి నుంచి కాలు బయట పెట్టేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇటీవల కాలంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో వీధి కుక్కలు వేల సంఖ్యలో పెరిగిపోయినట్లు అధికారులు లెక్కలు వేస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తూ కుక్కల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటిస్తున్న సంబంధిత విభాగం అధికారులు నివాస ప్రాంతాల నుంచి వాటిని తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నివారణ చర్యలు తీసుకుంటాం

ఈవిషయంపై కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలను వివరణ కోరగా... వీధుల్లో సంచరిస్తూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న వీధి కుక్కల నివారణకుచర్యలు తీసుకుంటామన్నారు.

కింది ప్రాంతాల్లో కుక్కల బెడద అధికం

- కుత్బుల్లాపూర్ డివిజన్ సూర్యనగర్‌లోని యూనిక్ స్కూల్ సమీపంలోని వీధిలో నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రోడ్డుపై గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే వారి వెంటపడి దాడి చేస్తున్నాయని స్థానికులు చెప్తున్నారు.
- పద్మానగర్ ఫేజ్-2 నుంచి సుచిత్ర వెళ్లే రోడ్డులోనూ గ్రామ సింహాల సంచారం ఇటీవల అధికమైంది. స్థానికులు తమ ఇళ్లలో మిగిలిన ఆహార వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు పక్కన డంప్ చేస్తుండడంతో వాటిని తినేందుకు కుక్కలు వస్తున్నాయి.
- బాపూనగర్‌లోని రోడ్ నెంబర్ 3 నుంచి శ్రీరాంనగర్ వెళ్లే మిలిటరీ ప్రహరీ పక్కన కుక్కలు ఎక్కువగా తిష్ట వేస్తున్నాయి.. ఉదయం వాకింగ్‌కు వచ్చిపోయే వారి వెంటపడి ఆందోళనకు గురి చేస్తున్నాయి.
- చెరుకుపల్లి కాలనీలోని తాటిచెట్టు సమీపంలోనూ కుక్కలు వాహనదారుల వెంటపడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి.
- గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్‌లోని రోడ్ నెంబర్ 2లో కుక్కలు గుంపుగా చేరి వచ్చిపోయే వారిని వెంబడిస్తున్నాయి. ఇటీవల మాజీ మున్సిపల్ చైర్మన్ లింగంగౌడ్ ఇంటి సమీపంలో ఓ వాహనదారుడి వెంట పడటంతో ఓ యువకుడు కింద పడి గాయాలకు గురయ్యారని స్థానికులు తెలుపుతున్నారు.
- జీడిమెట్ల గ్రామం నుంచి హరిజన బస్తీ మీదుగా సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డుకు వెళ్లే రోడ్డులో కుక్కలు అధికంగా ఉంటున్నాయని, అటుగా వెళ్లే వారి వెంట పడుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.
- పేట్‌బషీరాబాద్‌లోని రెలియన్స్ పెట్రోల్ బంక్ నుంచి యాదిరెడ్డినగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్ వెళ్లే రోడ్డంతా కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి.
- చింతల్‌లోని సూర్య అపార్ట్‌మెంట్స్ సమీపంలోనూ కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాటిని అరికట్టాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



బాపూనగర్‌లో ..

ఇద్దరిపై కుక్కల దాడి

పేట్‌బషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లిలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. బుధవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు కూలీల వెంటపడి కరిచాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించడంతో వారికి శస్త్ర చికిత్స చేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ప్రగతినగర్ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్ జోన్ బృందం, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు జయంతిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల కోసం ఒక్క రూపాయికే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన యుగపురుషుడని అన్నారు.



ఆదర్శనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షులు

'బీజేపీ ఎదుగుదల ఓర్వలేకే విమర్శలు'

నిజాంపేట్, మే28(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై విమర్శలు చేస్తున్నారని, ఇది ఏమాత్రం సబబు కాదని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, బీజేపీ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, భిక్షపతియాదవ్, ప్రసాద్‌రాజు అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్‌లో జైహింద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులందరినీ స్వాగతిస్తున్నామన్నారు. అయితే, ఇదే మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా రాలేదని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారిగా నిజాంపేట్ కార్పొరేషన్‌కు రాడడం, అది కూడా జాతీయ జెండానుపట్టుకొని, తిరంగా యాత్రలో పాల్గొనడానికి రావడం స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఇక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు కొందరు వక్ర బుద్ధితో బీజేపీ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని రాజకీయం చేస్తోందని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు బీజేపీపై విమర్శలు మాని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

పాము కనిపిస్తే 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్'ను సంప్రదించండి



పామును పట్టుకున్న వాలంటీర్ (ఫైల్)


అల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎండలు తగ్గి వర్షాలు పడుతుండటంతో పాముల సంచారం పెరిగింది. అయితే, గృహ సముదాయాలలో పాములు సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పాములను కొట్టి చంపేస్తున్నారు. అయితే, ఇలాంటి సమయాల్లో కంగారు పడకుండా 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' సంస్థ నెంబర్‌కు 83742 33366 ఫోన్ చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇలా చేస్తే సంస్థ వలంటీర్ వచ్చి ఇంట్లోని వారికి ఎలాంటి ప్రమాదం లేకుండా పామును పట్టుకొని తీసుకెళ్తారు. పామును పట్టుకున్నందుకు వారికి రూ.400 చెల్లించాల్సి ఉంటుందని, ఒక వేళ పాము దొరక్కపోతే రూ.300 చెల్లించాలని 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' ప్రధాన కార్యదర్శి అవినాష్ తెలిపారు. పామును పట్టుకుని అడవిలో వదిలిపెట్టేందుకు కనీస ఖర్చుల కింద ఈ రుసుం తీసుకుంటున్నామని అవినాష్ తెలిపారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు: ఎమ్మెల్యే

దుండిగల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మ, మియాపూర్, బహదూర్‌పల్లి, కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లంపేట రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు ఇతర పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చన్నారు. అలాగే, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా దుండిగల్‌ను తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, దుండిగల్ తహసీల్దార్ మతిన్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో బుధవారం అయ్యప్ప స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్‌ఎంసీ బీఆర్‌ఎస్ అధ్యక్షులు రంగరాయప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



పద్మారావు మృతదేహం

గాజులరామారం, మే28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సూరారం కాలనీలో పద్మారావు(40) వృద్ధురాలైన తన తల్లి కృష్ణవేణితో కలిసి నివాసముంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పద్మారావుకు పెళ్లి కాగా, భార్య జ్యోతి అతడి నుంచి విడిపోయి నగరంలోని రాంనగర్‌లో ఉంటోంది. ఇలా ఉండగా, మంగళవారం రాత్రి మద్యం తాగిన పద్మారావు వర్షం వస్తున్న సమయంలో ఇంటి ఆవరణలో పడుకున్నాడు. వర్షం ఎక్కువ కావడంతో ఇంట్లోకి రమ్మని తల్లి పిలిచింది. మద్యం మత్తులో ఉన్న పద్మారావు ఎంతకీ రాకపోవడంతో తల్లే కుమారుడిని చేయి పట్టుకుని లోపలికి తీసువెళ్లి పడకోబెట్టింది. గంట తర్వాత తల్లి అతడిని లేపగా లేవలేదు. అనుమానం వచ్చి ఆమె చుట్టుపక్కల వారిని పిలవగా, వారు వచ్చి అప్పటికే పద్మారావు మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు. స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. కాగా, భార్య జ్యోతి బుధవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత మాత్రమే మృతికి గల కారణాలు తెలుస్తాయని సీఐ భరత్‌కుమార్ తెలిపారు.

సూరారంలో వృద్ధుడి అదృశ్యం



రామిరెడ్డి

గాజులరామారం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. సూరారం పోలీసుల కథనం ప్రకారం.. కడపజిల్లా పులివెందుల ప్రాంతంలోని కోటిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గవిరెడ్డి రామిరెడ్డి (70) పది రోజుల క్రితం సూరారం వైష్ణవినగర్‌లో ఉంటున్న తన కుమార్తె, అల్లుడు వద్దకు వచ్చాడు. ఈనెల 27వ తేదీ ఉదయం 7 గంటలకు వాకింగ్ కోసం బయటకు వెళ్లిన రామిరెడ్డి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరి రిమాండ్

పేట్‌బషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసి అతడి మృతికి కారణమైన ఇద్దరు నిందితులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతానికి చెందిన నారాయణరావు (31) ఇటీవల దేవర యంజాల గ్రామంలోని మల్లన్న కాలనీకి వలస వచ్చి వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 16న మల్లన్న కాలనీలోని గోదావరి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద నారాయణరావు, కండ్లకోయకు చెందిన అనిల్‌కుమార్, పవన్‌కుమార్‌ల మధ్య మద్యం మత్తులో గొడవ జరిగింది. అనిల్, పవన్‌లు నారాయణరావుపై దాడి చేసి కొట్టారు. తీవ్ర గాయాలపాలైన నారాయణరావును గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో కార్మికురాలి మృతి



అనసూయ(ఫైల్)

అల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుదాఘాతానికి గురై మహిళా కార్మికురాలు మృతి చెందింది. స్థానికులు, అల్లాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్‌కు చెందిన గుంప నర్సయ్య భార్య అనసూయ స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పని చేస్తుండగా మెటీరియల్ లిఫ్టింగ్ మిషన్ ద్వారా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అవడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. అక్కడే ఉన్న వారు అనసూయను దగ్గరలో ఉన్న ఈఎస్ఐ. ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గుంతను పూడుస్తున్న దృశ్యం

ఎట్టకేలకు రోడ్డు మధ్యలో గుంతను పూడ్చారు!

గాజులరామారం, మే 28 (ఆంధ్రజ్యోతి):గాజులరామారం సర్కిల్ షాపూర్‌నగర్ ఉషోదయ చౌరస్తాలో రోడ్డు విస్తరణ చేసినప్పుడు మున్సిపల్ అధికారులు, పోలీసులు రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహాలను తీసి పక్కకు పెట్టించారు. విగ్రహాలను తీసి వేయడంతో రోడ్డు మధ్య ఏర్పడ్డ గుంతను పూడ్చకుండా వదిలేశారు. దీంతో గత 8 నెలలుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి బుధవారం రోడ్డు మధ్యలో ఉన్న గుంతను పూడ్చివేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.